# కాంగ్రెస్ పాలనలో అరాచకాలు

### మాజీ మంత్రి కేటీఆర్‌పై అక్రమ కేసు ఖండించిన బీఆర్ఎస్ శ్రేణులు



మంచాలలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

మంచాల, డిసెంబర్ 20: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏర్పడి ఏడాది అవుతున్నప్పటికీ అభివృద్ధిని మరిచి అరాచకాలు, అక్రమాలకే పెద్దపీట వేసిందని మంచాల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు చీరాల రమేష్ అన్నారు. శుక్రవారం మంచాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పి వాటిపి విస్మరించిందని ఆరోపించారు. రైతులందరికీ రుణమాఫీ చేస్తామని చెప్పి కేవలం 30శాతం మంది రైతులకు కూడా రుణమాఫీ చేయకపోవడం సిగ్గుచేటని అన్నారు. గిరిజన వసతి గృహల్లో చదువుకుంటున్న విద్యార్థులకు సరైన వసతులు లేక ఎంతో మంది విద్యార్థులు అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలవుతున్న కూడా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పుల్లారెడ్డి, బహుదూర్‌నాయక్, చంద్రయ్య, కిషన్‌రెడ్డి, రవి, విష్ణువర్ధన్‌రెడ్డి, రఘుపతి, బద్రినాథ్‌గుప్తా, విజయ్, శేఖర్, శంకర్, ప్రశాంత్‌కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.



మొయినాబాద్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు అనంతరెడ్డి, నర్సింహారెడ్డి

**అక్రమంగా కేసు నమోదు**

మొయినాబాద్ : గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఫార్ములా ఈ–కారు రేస్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసి అంతర్జాతీయంగా హైదరాబాద్ బ్రాండ్‌కు గుర్తింపు తీసుకొచ్చిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి, నాయకులు కొత్త నర్సింహారెడ్డి అన్నారు. మాజీ మంత్రి కేటీఆర్‌పై పెట్టిన అక్రమ కేసును బీఆర్ఎస్ శ్రేణులు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నిబంధనల ప్రకారమే ఈ–కారు రేసు ఏర్పాటు చేయడం జరిగిందని.. కానీ ప్రభుత్వ విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతున్నారని మాజీ మంత్రి కేటీఆర్‌పై అక్రమంగా ఏసీబీ కేసు నమోదు చేయించారని అన్నారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, వాగ్దానాలను అమలు చేయకుండా ప్రజల దృష్టిని మళ్లించడం కోసమే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుందని ఆరోపించారు. ప్రభుత్వం అక్రమంగా పెడుతున్న కేసులను వ్యతిరేకిస్తూ పోరాటం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు ఎంఏ రవూఫ్, నర్సింహ గౌడ్, వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పి.జగన్మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మాణిక్‌రెడ్డి, డేవిడ్, షాబాద్ ప్రవీణ్, పరమేశ్, చిన్న, అరవింద్, సునీల్‌కుమార్, అసీఫ్, షరీఫ్, భాస్కర్, రాజు, కిరణ్, రాజు, అమేర్, అలీమ్ పాల్గొన్నారు.

**రాజకీయ కక్ష్యతోనే కేటీఆర్‌పై కేసు**

ఇబ్రహీంపట్నంరూరల్ : కాంగ్రెస్ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలతో అక్రమ కేసులు బనాయిస్తుందని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ ఏనుగు భరత్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అక్రమ కేసు పెట్టడాన్ని శుక్రవారం తీవ్రంగా ఖండించారు. హైదరాబాద్ ఇమేజ్ పెంచటం కోసం కేటీఆర్ పనిచేస్తే.. సీఎం రేవంత్‌రెడ్డి కేటీఆర్‌పై అక్రమ కేసులు పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిత్యం ఎత్తిచూపుతున్నాడన్న భయంతో లేనిపోని కేసులు పెట్టాలని చూస్తుండడం సరికాదన్నారు.



కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని కలిసిన చిన్న సోలీపేట్ బీఆర్ఎస్ పార్టీ నేతలు



పట్నం నరేందర్‌రెడ్డి, యువనేత కార్తీక్‌రెడ్డిలను కలిసిన రుద్రారం బీఆర్ఎస్ పార్టీ నేతలు

## మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని కలిసిన బీఆర్ఎస్ శ్రేణులు

షాబాద్, డిసెంబర్ 20: కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని షాబాద్ మండల బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు కలిశారు. లగచర్ల ఘటనలో పెట్టిన అక్రమ కేసుల్లో జైలుకు వెళ్లి బెయిల్‌పై బయటకు వచ్చిన నరేందర్‌రెడ్డిని శుక్రవారం నగరంలోని ఆయన నివాసంలో షాబాద్ మండలంలోని చిన్న సోలీపేట్, రుద్రారం తదితర గ్రామాల బీఆర్ఎస్ పార్టీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యువనేత పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, సోలీపేట్ గ్రామ మాజీ సర్పంచ్ రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీటీసీలు గోపాల్, శంకర్, మహిపాల్‌రెడ్డి, పార్టీ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, సతీశ్, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ప్రతి సోమవారం ప్రజావాణి

### ఆర్డీవో కార్యాలయంలో నిర్వహణ
### చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ

చేవెళ్లటౌన్, డిసెంబర్ 20: రంగారెడ్డి కలెక్టర్ ఆదేశాలమేరకు ప్రతి సోమవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించనున్నట్లు చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు చేవెళ్ల ఆర్డీవో కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



మంచాలలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న నాయకులు



మొయినాబాద్‌లో సీపీఐ జెండాను ఎగురవేస్తున్న నాయకులు

# అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

### అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ వివిధ పార్టీల, సంఘాల నేతల ఆందోళన



యాచారంలో రాస్తారోకో నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

చేవెళ్లటౌన్, డిసెంబర్ 20: అంబేద్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం చేవెళ్ల మండల కేంద్రంలో అఖిల పక్ష పార్టీలు బీఆర్ఎస్, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, ఎస్ఎఫ్ఐ, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన, ధర్నా చేపట్టి అమిత్ షాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంతకుముందు అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అఖిలపక్షం నాయకులు ప్రభాకర్, రామస్వామి, దేవేందర్, వసంతం, సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లేశ్, ప్రభాకర్, మహేశ్, ప్రవీణ్, అరుణ్‌కుమార్, సత్యనారాయణచారి, రాంప్రసాద్ ఉన్నారు.

**బేషరతుగా క్షమాపణలు చెప్పాలి**

ఆమనగల్లు : దేశ ప్రజలకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా బేషరతుగా క్షమాపణలు చెప్పాలని ధర్మ సమాజ్‌పార్టీ జిల్లా కోకన్వీనర్ వంకేశ్వరం రమేశ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ జిల్లా కో కన్వీనర్ రమేశ్ మాట్లాడుతూ అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో డీఎస్పీ నాయకులు ప్రవీణ్, మహేశ్ ఉన్నారు.

**అమిత్‌షా రాజీనామా చేయాలి**

మొయినాబాద్ : పార్లమెంటులో అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమీత్‌షా వెంటనే రాజీనామా చేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, చేవెళ్ల నియోజకవర్గం సీపీఐ ఇన్‌చార్జి కె.రామస్వామి డిమాండ్ చేశారు. సీపీఐ వంద వసంతాల ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం మొయినాబాద్ మండల కేంద్రంలో ఎర్రజెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి శ్రీనివాస్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు అంజయ్య, సత్తిరెడ్డి, మంజూల, ప్రభాకర్, మోహన్‌రెడ్డి, జహంగీర్, యాదగిరి, నర్సింహులు, రాములు, యశోద, రాజు, లక్ష్మణ్, బాలరాజుగౌడ్, వెంకటేశ్, నర్సింహులు పాల్గొన్నారు.

**అట్రాసిటీ కేసు నమోదు చేయాలి**

యాచారం : బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును నమోదు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ దర్శి సభ్యుడు జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఆందోళనకు దిగారు. నాగార్జున సాగర్–హైదరాబాద్ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమిత్‌షాపై వెంటనే చర్యలు తీసుకోకపోతే దేశవ్యాప్తంగా ఆందోళనలు చేయనున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి భాస్కర్, నాయకులు మధుసూదన్‌రెడ్డి, యాదయ్య, సామేల్, జగదీశ్, నరసింహ, అంజయ్య, బ్రహ్మయ్య, జంగయ్య, చందూనాయక్, భూషణ్, అరుణ పాల్గొన్నారు.



షాబాద్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు, తదితరులు

**అంబేద్కర్‌ను అవమానిస్తే సహించేదిలేదు**

షాబాద్ : బి.ఆర్ అంబేద్కర్‌ను అవమానిస్తే సహించేదిలేదని మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, సమతా సైనిక్ దళ్ షాబాద్ మండలాధ్యక్షుడు కృష్ణ అన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం షాబాద్ మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలోనే ఉన్నతమైన పదవుల్లో ఉండి అంబేద్కర్‌ను అవమానించడం అమిత్‌షాకు సరికాదన్నారు. బి.ఆర్ అంబేద్కర్‌పై అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను బేషరత్‌గా వెనక్కి తీసుకోవాలని, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అమిత్‌షాను మంత్రి పదవి నుంచి వెంటనే తొలగించాలని చెప్పారు. లేని పక్షంలో ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం కేసులు పెడుతామన్నారు. కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాజు, నాయకులు శివశంకర్, బాల్‌రాజ్, నర్సింహులు, సుధాకర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

**సీపీఎం ఆధ్వర్యంలో నిరసన**

మంచాల : అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా సీపీఎం కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా శుక్రవారం మంచాల మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో, నిరసన చేపట్టారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి జంగయ్య, నాయకులు స్వామి, బుగ్గరాములు, యాదయ్య, జంగయ్య, జగన్, పి.విజయ్ పాల్గొన్నారు.

## మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

మొయినాబాద్, డిసెంబర్ 20 : దొంగతనం నెపం మోపారని ఓ వ్యక్తి మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌కు చెందిన మేగవి అనే మహిళ మొయినాబాద్ మండల పరిధిలోని అజీజ్‌నగర్ రెవెన్యూలో గల ఆర్గానిక్ విల్లాస్‌లో అద్దెకు ఉంటుంది. కాగా మొయినాబాద్ మండల పరిధిలోని చిన్నమంగళారం గ్రామానికి చెందిన అవుశేపట మల్లేష్ గౌడ్(42) అలియాస్ రాజుగౌడ్ ఆమె వద్ద 11 నెలలుగా డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. పది రోజుల క్రితం మేగవి ఇంట్లో దొంగతనం జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేశారని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని ఆర్గానిక్ విల్లాస్ పని చేసేవారిని విచారించడం జరిగింది. అదే విధంగా మల్లేష్ గౌడ్‌ను పోలీస్‌స్టేషన్‌కు రెండు సార్లు పిలిచి విచారణ చేసి పంపించారు. ఈ క్రమంలో పోలీసులు పట్టించుకోవడం లేదని, సీపీ వద్దకు వెళ్తున్నా.. అని డ్రైవర్ మల్లేశ్‌ను గురువారం బయపెట్టింది. దీంతో మల్లేశ్‌గౌడ్ భయాందోళనకు గురై మనస్తాపం చెంది శుక్రవారం తెల్లవారు జామున పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నం చేశాడు. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

## లారీ కింద పడి యువకుడి మృతి

మొయినాబాద్, డిసెంబర్20: రోడ్డుపై వెళ్తున్న ఓ లారీ కింద ఆకస్మాత్తుగా ఓ యువకుడు పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శుక్రవారం మొయినాబాద్ మండల పరిధిలోని అజీజ్‌నగర్ పాత గేట్ సమీపంలో జరిగింది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మెహిదిపట్నం పరిధిలోని ఆసిఫ్‌నగర్ ప్రాంతానికి చెందిన లోకేశ్(40) ఓ మహిళను బైక్ మీద తీసుకుని చిలుకూరు బాలాజీ ఆలయానికి వచ్చారు. స్వామి వారిని దర్శించుకున్న తరువాత తిరిగి వెళ్తుండగా అజీజ్‌నగర్ పాత గేట్ సమీపంలో హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి పక్కన మహిళను బైక్ పై నుంచి దింపి రోడ్డు మీద వెళ్తున్న లారీ వెనకాల టైర్ కింద ఆకస్మాత్తుగా పడి ఆత్మహత్య చేసుకున్నాడు. లారీ డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

## దోమల నియంత్రణకు కృషి



ఫాగింగ్ యంత్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ నరేందర్

షాద్‌నగర్‌రూరల్,డిసెంబర్20: షాద్‌నగర్ మున్సిపాలిటీలో దోమల నివారణ కోసం కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ నరేందర్ అన్నారు. దోమల నివారణ కోసం రూ.5లక్షలతో కొనుగోలు చేసిన దోమల ఫాగింగ్ యంత్రాలను శుక్రవారం మున్సిపల కార్యాలయంలో అధికారులు, నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీలోని ప్రతి వార్డులో దోమల నివారణ కోసం ఫాగింగ్ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

# కార్మికుల ముందస్తు అరెస్టు సిగ్గుచేటు



ఆటో యూనియన్ కార్మికులను అరెస్టుచేసిన పోలీసులు



మాడ్గుల పోలీస్‌స్టేషన్‌లో అరెస్టు అయిన ఆటో యూనియన్ నాయకులు

ఇబ్రహీంపట్నంరూరల్, డిసెంబర్ 20 : హైదరాబాద్‌లో జరుగనున్న ఆటో యూనియన్ల మహాధర్నా నేపథ్యంలో ఇబ్రహీంపట్నం ఆటో యూనియన్ కార్మికులను ముందస్తు అరెస్టు చేయటం సిగ్గుచేటని యూనియన్ జేఏసీ చైర్మన్ వేణుగోపాల్ రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నంలో పలువురు ఆటో యూనియన్ కార్మికులను ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రేవంత్‌రెడ్డి సర్కారు ఆటో కార్మికుల పట్ల అత్యంత కర్కశంగా వ్యవహరిస్తుందని, కార్మికుల పట్ల వివక్ష చూపటం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ కార్మికులు రాములు, శ్రీనివాస్, వినోద్, రవి, సురేశ్ పాల్గొన్నారు.

**ఆటో యూనియన్ నాయకుల ముందస్తు అరెస్టు**

మాడ్గుల : ఆటో కార్మికుల పలు డిమాండ్లను నెరవేర్చాలని రాష్ట్ర ఆటో యూనియన్ జాయింట్ యాక్షన్ కమిటీ ఈ నెల 22వ తేదీన చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం పిలుపునివ్వడంతో మండల పరిధిలోని ఆటో యూనియన్ నాయకులను శుక్రవారం పోలీసులు మందస్తు అరెస్టు చేసినట్లు సీఐ జగదీశ్ తెలిపారు. అరెస్టు అయిన వారిలో సయ్యద్ ఇమాం సాహెబ్, వీరమల్ల శ్రీనివాస్, ఎండీ ఇబ్రహీం, సయ్యద్ షరీఫ్ ఉన్నారు.

## గురుకుల పాఠశాల సందర్శన



శంకర్‌పల్లి బాలికల గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడుతున్న ప్యానల్ ఇన్‌స్పెక్షన్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్

మొయినాబాద్, డిసెంబర్20: గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న బోధనా విధానం, మధ్యాహ్న భోజనం, విద్యార్థులకు ఏర్పాటు చేసిన వసతులు, సౌకర్యాలను తెలుసుకోవడానికి ప్రభుత్వం విద్యాశాఖ ద్వారా ఏర్పాటు చేసిన ప్యానల్ ఇన్‌స్పెక్షన్ బృందం గురుకుల పాఠశాలలను సందర్శిస్తున్నాయి. శుక్రవారం మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ శంకర్‌పల్లి గురుకుల బాలికల పాఠశాలను ప్యానల్ ఇన్‌స్పెక్షన్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ సందర్శించారు. వసతి గృహంలోని వంటశాల, గ్రంథాలయం, ల్యాబ్‌లను పరిశీలించారు. సందర్శించిన వారిలో ప్యానల్ ఇన్‌స్పెక్షన్ అధ్యక్షుడు శ్రీనివాస్ పాఠశాల ప్రిన్సిపాల్ డి.రమాదేవి ఉన్నారు.

## నైపుణ్యాభివృద్ధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిబట్ల, డిసెంబర్ 20: తెలంగాణ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ వారు నిరుద్యోగ మైనారిటీ యువతకు ఎంప్లాయిమెంట్, ప్లేస్‌మెంట్ ప్రోగ్రాం, ఇంపార్టింగ్ స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ కోసం ఆసక్తి గల మైనార్టీ యువతి, యువకుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, డాటా సైన్స్, డిజిటల్ మార్కెటింగ్ మేనేజర్ కోర్సులు మూడు నెలల కాల పరిమితితో ఉంటుందన్నారు. ఇంటర్, ఆపై చదువుకున్నవారు ఆధార్‌కార్డు, విద్యార్హత పత్రాలు, ఆదాయ ధ్రువీకరణపత్రాలు తదితరాలతో ఈ నెల 31వ తేదీ వరకు కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

## సీసీ కెమెరాల ఏర్పాటుకు ఆర్థికసాయం




మాడ్గుల, డిసెంబర్ 20: మండల పరిధిలోని కొల్కులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రవాస భారతీయురాలు బట్టు గోదారెడ్డి రూ. 40 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ కిషన్ రెడ్డి, మాజీ సర్పంచ్ అనురాధ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## మెరుగైన వైద్య సేవలందించాలి

### రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు, డిసెంబర్ 20: ప్రభుత్వాలు పేదలకు మెరుగైన వైద్య సేవలందించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వెల్దండ మండల పరిధిలోని గాన్‌గట్టుతండాకు చెందిన శ్రేయస్సీకి సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ. 51వేల చెక్కును శుక్రవారం బాధిత కుటుంబ సభ్యుడికి ఆయన అందజేశారు. ఆయన వెంట నాయకులు సతీశ్, శివ, ఇస్మాయిల్, యాదగిరి, సాయి పాల్గొన్నారు.

## విద్యార్థినులు క్రీడల్లోనూ రాణించాలి



షాద్‌నగర్‌టౌన్, డిసెంబర్ 20: విద్యార్థినులు క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవడంతో పాటు చదువుల్లో రాణించాలని మల్టీజోన్–2 ఆఫీసర్ రజని అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో కొనసాగుతున్న 10వ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను జోనల్ ఆఫీసర్లు నిర్మల, రాణి, పాఠశాల ప్రిన్సిపాల్ విద్యులతతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడా పోటీలతో శరీర దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, విద్యార్థులు చిన్నతనం నుంచే క్రీడల్లో రాణించే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. రాష్ట్రంలోని 7జోన్ల నుంచి అండర్ 14, 17,19 విభాగాల్లో 1190మంది విద్యార్థినులు పాల్గొన్నారని, ఇందులో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థినులు జనవరిలో నిర్వహించే ఇంటర్ సొసైటీ రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొననున్నారని వివరించారు. ఈ రాష్ట్రస్థాయి పోటీల్లోని విజేతలకు శనివారం సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి వర్షిణి బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రీడల నిర్వహణ ఫిజికల్ డైరెక్టర్ ఉదయభాస్కర్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## గణిత పోటీల్లో విద్యార్థి ప్రతిభ




షాద్‌నగర్‌రూరల్, డిసెంబర్20: తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల షాద్‌నగర్‌లో శుక్రవారం మండలస్థాయిలో నిర్వహించిన గణిత పోటీల్లో ఫరూఖ్‌నగర్ మండలంలోని విఠ్యాల ఉన్నతపాఠశాలలో చదువుతున్న విద్యార్థి కార్తిక్ ఉత్తమ ప్రతిభ కనబర్చి తృతీయ స్థానంలో నిలిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవికుమార్ తెలిపారు. మండల స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచిన కార్తిక్ జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొనున్నట్లు ఆయన తెలిపారు.

### ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



కడ్తాల్, డిసెంబర్ 20: మండల పరిధిలోని ఏక్వాయిపల్లి గ్రామంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్–రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్–గంప లక్ష్మయ్యగుప్త చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, కామినేని దవాఖాన సహకారంతో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని స్థానిక నాయకులతో కలిసి డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్ గుప్తా, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్ ప్రారంభించారు. ఈ శిబిరంలో 333 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు వైద్యులు అఖిల్, అనిల్, భావని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ వీరయ్య, మాజీ ఉసర్పంచ్ ముత్యాలు, నాయకులు పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

చేవెళ్లటౌన్, డిసెంబర్ 20: మూడు రోజుల క్రితం చేవెళ్ల మండల పరిధిలోని తంగడిపల్లి గ్రామానికి చెందిన మడికట్టు పోచయ్య ప్రమాదవశాత్తు యాక్సిడెంట్‌కు గురై చికిత్స పొందుతూ మృతి చెందాడు. శుక్రవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలో కుటుంబ సభ్యులకు చేవెళ్ల మాజీ ఎంపీపీ మంగళి బాల్‌రాజ్ రూ.25వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట తంగడిపల్లి గ్రామ మాజీ సర్పంచ్‌లు సత్యయ్యగౌడ్, రాములుగౌడ్ ఉన్నారు.

### ఘనంగా ప్రమాణ స్వీకారం



బడంగ్‌పేట, డిసెంబర్20: మహేశ్వరం నియోజక వర్గం పరిధిలోని తుక్కుగూడలో బ్రాహ్మణ అభ్యుదయ పరిషత్ నూతన కార్యవర్గ సభ్యులు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. రంగారెడ్డి జిల్లా యువజన సంఘం కోశాధికారిగా ప్రదీప్ శర్మ, సంఘం అధ్యక్షుడిగా కురుమేటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా వంశీ శాస్త్రి, కోశాధికారిగా శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులుగా దేరం భాస్కర్ శర్మ, అంబా ప్రసాద్ శర్మ, శ్రీధర్ శర్మ, కార్యదర్శిగా ప్రదీప్ శర్మ, సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. సంఘాన్ని బలోపేతం చేస్తామని వారు పేర్కొన్నారు.